క్లుప్తంగా

ఘనంగా లక్ష చామంతి పూజ

మామిడికుదురు: ధనుర్మాసం సందర్భంగా పెదపట్నంలంకలో కొలువుదీరిన ఉమా సత్య లింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్వతీదేవికి కుంకుమార్చన, లక్ష చామంతి పూజ వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు ఆదిరాజు రఘునాథశర్మ ఆధ్వర్యంలో సత్యలింగేశ్వరునికి పంచామృతాలతో అభిషేకాలు జరిపించారు. అనంతరం అమ్మవారికి లక్ష చామంతి పూజ ఘనంగా జరిగింది. పలువురు భక్తులు ఈ పూజలో పాల్గొని స్వామి, అమ్మవార్ల తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రేపటి నుంచి సప్తాహం

మామిడికుదురు: పెదపట్నంలోని మూలేశ్వర స్వామి, వేణుగోపాలస్వామి, కనకదుర్గమ్మ వార్ల ఆలయ ప్రాంగణంలో ఈ నెల 10వ తేదీ బుధవారం నుంచి సప్తాహం ప్రారంభమవుతుందని ఆలయ కమిటీ సోమవారం తెలిపింది. ఈనెల 17వ తేదీ వరకు ఈ సప్తాహం జరుగుతుందని కమిటీ పేర్కొంది. బుధవారం ఉదయం 6.05 గంటలకు తోరం యువరాజు, సూర్యకుమారి దంపతులతో కలశ స్థాపన జరుగుతుందన్నారు. సప్తాహంలో భాగంగా శ్రీరామనామ సర్వనామ కీర్తనలతో నిరంతరాయంగా ఏడు రోజుల పాటు భజన కార్యక్రమం జరుగుతుందని కమిటీ పేర్కొంది. సప్తాహంలో భాగంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఏపీ ఎన్జీసీ స్టేట్ మానిటరింగ్ ఆఫీసర్‌గా ప్రభావతి


గుండేపల్లి ప్రభావతి (ఫైల్)

సఖినేటిపల్లి: ఏపీ నేషనల్ గ్రీన్ కార్ప్స్ (ఎన్జీసీ)స్టేట్ మానిటరింగ్ ఆఫీసర్‌గా సఖినేటిపల్లి లంక జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు టీచర్ గుండేపల్లి ప్రభావతి నియామకం జరిగింది. ఈ మేరకు ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు విజయవాడ నుంచి ఏపీ ఎన్జీసీ డైరెక్టర్ పి.స్రవంతి నుంచి సోమవారం వచ్చినట్టు ఆమె తెలిపారు. దీంతో ఇంత వరకూ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్‌గా ఉన్న ఆమెకు పై అవకాశం దక్కింది. కాగా ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్స్ పైన, అన్ని జిల్లాల్లోని ఎకో క్లబ్ స్కూల్స్ నమోదుపైన మానిటరింగ్ చేసే బాధ్యతలను ఆ ఉత్తర్వుల్లో ఆమెకు ఇచ్చారు. పర్యావరణ పరిరక్షణకు, పరిసరాల పరిశుభ్రతకు, పచ్చని మొక్కలు పెంపకానికి రాష్ట్ర వ్యాప్తంగా పర్యవేక్షిస్తానని ఆమె తెలిపారు.

వేంకటేశ్వరునికి లక్షతులసి పూజ


అంబాజీపేటలో వేంచేసిన వేంకటేశ్వర స్వామి

అంబాజీపేట: అంబాజీపేట కొర్లపాటి వారిపాలెంలో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో లక్షతులసి పూజ మంగళవారం రాత్రి వైభవంగా జరిగింది. పాణింగపల్లి నరసింహాచార్యుల పర్యవేక్షణలో పెద్దింటి వెంకటలక్ష్మీ నరసింహాచార్యులు ఆధ్వర్యంలో వైఖానస ఆగమ, శైవ, శాక్తేయ, స్మార్త ఆగమ విధానాల ప్రకారం ఈ పూజ నిర్వహించారు. విష్ణు సహస్రనామార్చన, విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, న్యాసార్చన, పంచామృతాభిషేకం, లక్షతులసి పూజ, కుంకుమార్చన, గుడోదకతర్పణం, సమిదాజ్య, చరు వ్రీహి హోమాలు జరిపించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై సమీక్ష

అలమూరు: మండలంలోని జొన్నాడ-1 గ్రామ సచివాలయంలో మంగళవారం నిర్వహించబోయే జగనన్న ఆరోగ్య సురక్ష (2.0) శిబిరం ఏర్పాటుపై సమీక్ష జరిగింది. స్థానిక వెల్‌నెస్ అండ్ హెల్త్ సెంటర్‌లో పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సాయి కిషోర్ నేతృత్వంలో సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెచ్ఈ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.ఉమ, ఏఎన్ఎం కె.అనంతలక్ష్మి, తదితరులు స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వివరాలను తెలియజేయాలని ఆశ కార్యకర్తలకు వారు సూచించారు. ప్రజారోగ్యమే ప్రభుత్వం ఆశయం అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకునే విధంగా వైద్యారోగ్య సిబ్బంది కృషి చేయాలన్నారు.

కత్తిమండలో భగవద్గీత ప్రచారం

మలికిపురం: మండలంలోని కత్తిమండలో ఆదివారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు గురువు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. త్రైతసిద్ధాంతం-ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక- మామిడికుదురు కమిటీ అధ్యక్షుడు, సభ్యులు బండారు సత్యనారాయణ మాట్లాడుతూ భోగి - సంక్రాంతిల విశిష్టత వివరించారు. భగవద్గీత జ్ఞానం ప్రకారం 'క్రాంతి' అంటే తిరుగుబాటు అని, 'సంక్రాంతి' అంటే మనిషిలోని దుర్గుణాలపై తిరుగుబాటు అని సుఖ, భోగ వాంఛలను అగ్నికి ఆహుతి చేయాలని భోగి మంటలు అనే అగ్నిలో కోరికలు, సకల కర్మలు కాల్చివేసేందుకు గుర్తు అని సూచించారు. కోరికలు, కర్మలు పూర్తిగా లేకుండా పోతే ఉత్తరాయణం రోజు మోక్షం కలిగి విముక్తి కలుగుతుంది. కాబట్టి సంక్రాంతిని పెద్ద పండగ అంటారని తెలియజేశారు. హనుమంతరావు, బ్రహ్మాజీ, జగదీష్, విశ్వనాథం, సుబ్బారావు, సత్యవతి తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

పారదర్శకతే ప్రామాణికంగా పథకాలు

- ఎమ్మెల్యే జగ్గిరెడ్డి
- నర్సిపూడిలో గడప గడపకూ..


నర్సిపూడిలో మహిళకు పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

అలమూరు: ప్రజా సంక్షేమం.. నియోజకవర్గ అభివృద్ధి.. పారదర్శకతే ప్రామాణికంగా అర్హులైన పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ మండలంలోని నర్సిపూడిలో సోమవారం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి అపూర్వ ఆదరణ లభించింది. పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, పార్టీ సీనియర్ నేత చల్లా వెంకట సుబ్రహ్మణ్యం, సర్పంచ్ కందిబొట్ల శ్రీనివాసు, ఎంపీటీసీ మేడిశెట్టి సుబ్బారావు, మాజీ ఉప సర్పంచ్ చల్లా పద్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల వల్ల కలిగిన లబ్ధిని గణాంకాలతో సహా ప్రజలకు వివరించారు. గ్రామస్తులు లేవనెత్తిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తూ, సందేహాలను నివృత్తి చేస్తూ అకుంఠిత దీక్షతో ముందుకు సాగారు. గ్రామంలో అపరిష్కృతంగా ఉన్న అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పేద ప్రజల అభ్యున్నతికి ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను రాబోయే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అర్హులైన లబ్ధిదారులకు గ్రామంలో నవరత్న పథకాల వల్ల రికార్డు స్థాయిలో రూ.12.27 కోట్ల లబ్ధి చేకూర్చిన ప్రభుత్వానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఎం.పోశమ్మ, గ్రామ కార్యదర్శి ఆర్‌వీవీ సత్యనారాయణ వెంట ఉన్నారు.

అభివృద్ధి పథకాలకు శ్రీకారం

మండలంలోని నర్సిపూడిలో సుమారు రూ.1.27 కోట్లతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి శ్రీకారం చుట్టారు. జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ 39.8 లక్షలతో నిర్మించనున్న 60 వేల లీటర్ల పరిమితి గల వాటర్ ట్యాంకుకు భూమి పూజ చేశారు. 40.5 లక్షలతో ఏర్పాటు చేయనున్న ఇంటింటికీ తాగునీరు పైప్‌లైన్ పనులకు అంకురార్పణ జరిగింది. అలాగే రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతా మహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి దియ్యన పెదకాపు, ఉండమట్ల సూర్యం తదితరులు పాల్గొన్నారు.

స్మృతివనం ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలి


స్మృతివనం ప్రారంభోత్సవ కరపత్రాలు విడుదల చేస్తున్న పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి విప్పర్తి

పి.గన్నవరం: విజయవాడలో రూ.404 కోట్లతో నిర్మించిన దేశంలోనే అతి పెద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని ఈనెల 19న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరిస్తున్నారని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి విప్పర్తి వేణుగోపాలరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున అంబేడ్కర్‌వాదులు తరలివెళ్లి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పి.గన్నవరంలోని తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విప్పర్తి మాట్లాడారు. విజయవాడ నగరం నడిబొడ్డున స్వరాజ్య మైదానంలో 125 అడుగుల ఎత్తున డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మించినట్టు వివరించారు. సీఎం జగన్ అంబేడ్కర్ సూచించిన మార్గంలో పయనిస్తూ సామాజిక న్యాయం అందిస్తున్నారని వివరించారు. జగనన్నతో కలసి అంబేడ్కర్ మహా శిల్ప విగ్రహావిష్కరణలో అందరూ పాల్గొనాలని విప్పర్తి విజ్ఞప్తి చేశారు. జెడ్పీటీసీలు గన్నవరపు శ్రీనివాస్, బూడిద వరలక్ష్మి, సొసైటీ చైర్మన్లు యన్నాబత్తుల ఆనంద్, మెల్లం మహాలక్ష్మి ప్రసాద్, రాష్ట్ర నాయకుడు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, సరెళ్ల అప్పారావు, పుచ్చకాయల నర్సింహమూర్తి, కొక్కిరి రవికుమార్, మంగం శ్రీను, జల్లి శ్రీను తదితర దళిత నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనృసింహుని కల్యాణం


అంతర్వేదిలో శ్రీస్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో సోమవారం ఆర్జిత సేవగా స్వామివారి శాంతి కల్యాణం బహుళ ద్వాదశి తిథి నాడు అర్చకులు ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలోని కల్యాణ మండపంలో ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. అనంతరం స్వామివారి శాంతి కల్యాణం విష్వక్సేన పూజతో అర్చకులు ప్రారంభించారు. వేద మంత్రాలతో, మంగళవాయిద్యాల నడుమ కనుల పండువగా ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, ముఖ్య అర్చక పి.శ్రీనివాస్‌లు ఈ కల్యాణం నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆధ్వర్యాన సిబ్బంది కల్యాణంలో పాల్గొన్న భక్తులకు స్వామి మూలవిరాట్ దర్శనం కల్పించింది. అలాగే ప్రసాదం ఇచ్చి, అన్నదాన పథకంలో భోజన సౌకర్యం కూడా కల్పించింది. ఆలయ సూపరింటెండెంట్ పి.విజయసారథి పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి


మామిడికుదురులో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ


ఊబలంకలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు

మామిడికుదురు: ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సక్రమంగా వినియోగించుకుని విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు సూచించారు. మామిడికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన సమావేశంలో మండలంలోని 12 జెడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన 541 మంది విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన స్టడీ మెటీరియల్‌ను జెడ్పీటీసీ అంజిబాబు, ఎంపీపీ కుసుమ వనజకుమారి అందజేశారు. వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. నాడు-నేడు ద్వారా విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకు వచ్చారన్నారు. విద్య ద్వారా ప్రతి ఒక్కరూ ప్రయోజకులు కావాలన్నదే జగన్ లక్ష్యమన్నారు. దానికి అనుగుణంగా విద్యార్థులు అభివృద్ధి సాధించాలని అభిలషించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నయినాల సీతామహాలక్ష్మి, ఎంఈఓలు లక్ష్మీనారాయణ, మోకా వెంకన్నబాబు, హెచ్ఎం సీహెచ్ నిరంజని, పీఎంసీ చైర్మన్ మట్టా వెంకటేష్, ఏఓ కె.వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నేతలు కుసుమ శ్రీధర్, నయినాల సత్యమూర్తి, పలు పాఠశాలలకు చెందిన హెచ్ఎంలు పాల్గొన్నారు.

రావులపాలెం: మండలంలోని ఊబలంక మల్లిడి వెంకటరెడ్డి మెమోరియల్ హైస్కూల్‌లో సోమవారం పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. హెచ్ఎం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా జెడ్పీటీసీ కుడిపూడి శ్రీనివాసరావు హాజరై జిల్లా పరిషత్ నుంచి పంపిణీ చేసిన జగనన్న విద్యాభారతి స్టడీ మెటీరియల్ విద్యార్థులకు అందజేశారు. అలాగే యూటీఎఫ్ స్టడీ మెటీరియల్‌ను ఉప సర్పంచ్ కొవ్వూరి దుర్గారెడ్డి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే ఎస్ఎస్‌సీ పరీక్షల్లో మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ.20 వేలు, రెండో బహుమతిగా రూ.10 వేలు, మూడో బహుమతిగా రూ.5 వేలు ఇస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ గొలుగూరి రామకృష్ణారెడ్డి, దిడ్ల కిషోర్, చిన్నం సోమిరెడ్డి యూటీఎఫ్ మండల అధ్యక్షులు పి.లింగేశ్వరరెడ్డి, జిల్లా కార్యదర్శి బాలాజీ, ఉపాధ్యాయులు నంబూరి సూరిబాబు, సూర్యనారాయణరావు, వీరరాఘవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్ని దానాల్లో అన్నదానం మిన్న


విఘ్నేశ్వరుని ఆలయంలో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న అరుణాచల రుద్రాక్ష స్వామీజీ

అయినవిల్లి: అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మిన్న అని అరుణాచలం పంచ లింగపీఠం అరుణాచల రుద్రాక్ష స్వామీజీ శిష్య బృందం అన్నారు. సోమవారం స్వామిజీ తన శిష్య బృందంతో అయినవిల్లిలోని విఘ్నేశ్వరస్వామిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన స్వామివారి అన్నదాన సత్రంలో భక్తులకు భోజనం వడ్డించారు. ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అరుణాచలంలో స్వామీజీ అరుణాచలేశ్వరుణ్ణి దర్శించడానికి విచ్చేసిన భక్తుల కోసం పీఠంలో అన్నదానం ఏర్పాటు చేశారని శిష్య బృందం తెలిపింది. ప్రతి సోమవారం స్వామిజీ మౌనదీక్షలో ఉంటారన్నారు. ఈ రోజు కూడా మౌనదీక్షలో ఉన్నారన్నారు. అలాగే అక్కడి సాధువులకు ఉచితంగా స్వామీజీ వైద్యం అందజేస్తున్నట్లు తెలిపారు. కోనసీమ జిల్లాలో ఉన్న ప్రముఖ ఆలయాలను సందర్శించి అరుణాచల పుణ్యక్షేత్రం, గిరి ప్రదక్షిణ విశిష్టతను భక్తులకు వివరించేందుకు వచ్చామని తెలిపారు.

సేవాతత్పరుడు శేర్ భేరూలాల్ మృతి



కొత్తపేట: స్థానిక బంగారు వ్యాపారి, సేవాతత్పరుడు శేర్ భేరూలాల్ (73) మృతి చెందారు. అనారోగ్యానికి గురైన ఆయన రాజమహేంద్రవరంలో ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ముంబాయికి చెందిన భేరూలాల్ సుమారు 50 ఏళ్ల క్రితం కొత్తపేట వచ్చి స్థిరపడ్డారు. వ్యాపారంలో రాణిస్తూ వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక పొట్టి శ్రీరాములు వీధిలో జైన్ దేవాలయం ఏర్పాటు చేశారు. సహాయం అర్థించి వచ్చిన వారికి వివిధ రూపాల్లో సాయం చేసేవారు. ఆయన మృతికి బంగారం వ్యాపారులు సంతాపం వ్యక్తం చేశారు. భేరూలాల్ మృతికి పలువురు పెద్దలు సంతాపం వ్యక్తం చేశారు.

ఆకట్టుకున్న సంక్రాంతి సంబరాలు


పి.గన్నవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి ప్రభను ఊరేగిస్తున్న విద్యార్థినులు

మామిడికుదురు: సంప్రదాయ వేషధారణలు, పిండి వంటలు, ముగ్గులు, గొబ్బెమ్మలు, బొమ్మలకొలువు, కోడి పందేలు, రెండెడ్ల బళ్ల విన్యాసాలు, సంక్రాంతికి తలమానికంగా నిలిచే ప్రభలు, సంప్రదాయ వస్త్రాలు, బొమ్మల కొలువు, భోగి మంటలు తదితర అంశాలతో సోమవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. మామిడికుదురు, గోగన్నమఠం పాఠశాలల్లో జరిగిన సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు రెట్టించిన ఉత్సాహంతో పాల్గొన్నారు. విద్యార్థులు కోలాటం ఆడుతూ పాటలు పాడుతూ సందడి చేశారు. ముందస్తు సంక్రాంతి సంబరాలను ఆద్యంతం కోలాహలంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంఈఓలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు భూపతిరాజు లక్ష్మి, సర్పంచ్ అల్లు విజయలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ సాగి పీఆర్‌వీఎస్ఎస్ నర్సింహ వర్మ, భూపతిరాజు సత్తిబాబురాజు, డీవీవీ సత్యనారాయణ, హెచ్ఎంలు బావిశెట్టి నాగేశ్వరరావు, యక్కలదేవర వెంకన్నబాబు పాల్గొన్నారు.

అలమూరులో..

అలమూరు: స్థానిక కొత్తూరు మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో విద్యార్థుల ఆనందోత్సాహాల మధ్య సోమవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. నాటి సనాతన సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, సంక్రాంతి ఆవశ్యకతను ఉపాధ్యాయులు కె.సుజాత, వైవీవీ రమణ వివరించారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా భోగి మంటలను వెలిగించి వేడుకలను ప్రారంభించారు. ముత్యాల ముగ్గులు పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అలాగే హరిదాసు, డూడూ బసవన్న, కొమ్మదాసు, గోదాదేవి తదితర వేషధారణలు విశేషంగా ఆకట్టుకున్నాయి. నేటి ఆధునిక యుగంలో కనుమరుగవుతున్న ప్రాచీన సంస్కృతి సంప్రదాయాలను నేటితరానికి తెలియజేసేందుకు ఉపాధ్యాయులు చేపట్టిన సంక్రాంతి సంబరాలపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని అంబాజీపేట, గంగలకుర్రు అగ్రహారం జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు, రంగవల్లులు విద్యార్థుల తల్లిదండ్రులను మంత్రముగ్ధుల్ని చేశాయి. హెచ్ఎంలు కడలి సాయిరామ్, ఖండవల్లి శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన రంగవల్లుల పోటీల్లో నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం భోగి మంటను వెలిగించి సంక్రాంతి సంబరాలు జరుపుకొన్నారు. జి.అగ్రహారంలో ప్రభను విద్యార్థులు ఊరేగించారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్ఎం డీఎస్‌వీ ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఎస్ఎంసీ చైర్మన్ గూటం శ్రీనివాసరావు సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. విద్యార్థులు సంకాంత్రి ప్రభలను ఊరేగించి, భోగి మంటలు వేసి సందడి చేశారు. సంప్రదాయంలో భాగంగా సరదాగా కోడి పందాలు నిర్వహించారు. విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. అలాగే పోతవరం ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం కత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో సోమవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు హెచ్ఎం ఆనందరావు ఆర్థిక సాయం రూ.6 వేల విలువైన బహుమతులు అందజేశారు. విద్యార్థులు విచిత్ర వేషాలు, సంక్రాంతి పాటలతో విద్యార్థులు అలరించారు. ఎస్ఎంసీ చైర్మన్ కె.దుర్గ, ఉపాధ్యాయులు బి.మల్లికార్జునరావు, ఎండీ ఇస్మాయిల్, జె.శ్రీనివాస్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


జి.అగ్రహారంలో భోగి మంట వద్ద ప్రభను ఊరేగిస్తున్న విద్యార్థులు


కొత్తూరు ఎంపీపీ పాఠశాలలో సంక్రాంతి వేడుకలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు


మామిడికుదురులో ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణలు

అయినవిల్లిలో వికసిత్ భారత్

అయినవిల్లి: గ్రామంలో సర్పంచ్ కాకర శ్రీనివాస్ అధ్యక్షతన వికసిత్ భారత్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వేమా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందిస్తున్న 22 సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తాడి శ్రీవెంకచార్య, ఈఓపీఆర్డీ మోహన్‌కృష్ణ, పంచాయతీ కార్యదర్శి రామచంద్రరావు తదితరులు ఉన్నారు.

నిత్యావసరాల పంపిణీ


మామిడికుదురులో తుపాను బాధితులకు నిత్యాసరాల పంపిణీ

మామిడికుదురు: స్థానిక క్రీస్తురాజు దేవాలయంలో సోమవారం తుపాను బాధితులకు ఏలూరు మేత్రాసన మహాఘన పాలిమేర జయరావు బిషప్ ఆధ్వర్యంలో సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ రెవరెండ్ ఇమ్మానియేలు బృందం 500 కుటుంబాలకు నిత్యావసరాలు అందించారు. ఇటీవల ఏర్పడిన తుపానుతో ఎంతో మంది ఇబ్బంది పడ్డారని పేర్కొన్నారు. వారికి జయరావు అండగా నిలిచారని చెప్పారు. కార్యక్రమంలో రెవరెండ్ రాజేష్, ఉప దేశకులు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

నేడు రాజోలులో సురక్ష శిబిరం

రాజోలు: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం మంగళవారం రాజోలు బాలికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ ఎస్.బాలాజీ సోమవారం తెలిపారు. తాటిపాక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య నిపుణులు శిబిరంలో వైద్య సేవలు అందిస్తారన్నారు. ఉచితంగా వైద్య పరీక్షలతో పాటు, ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. వైద్య శిబిరం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్వచ్ఛమైన తాగునీటి పంపిణీ

సఖినేటిపల్లి: సామాన్య ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పథకం అమలు చేస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ మెంబర్ అడబాల సత్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్ అన్నారు. సోమవారం అంతర్వేది దేవస్థానం, కేశవదాసు పాలెం పంచాయతీల వద్ద అధికారులు వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాల సమావేశాలు నిర్వహించారు. అంతర్వేది దేవస్థానంలో సర్పంచ్ కొండా జాన్‌బాబు, కేశవదాసుపాలెంలో ఈవోపీఆర్డీ కె.సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కేంద్రం ద్వారా అమలవుతున్న పథకాలను తెలిపేందుకు వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు అన్నారు. ఆయా శాఖల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రాధాన్యం, వాటి ఉపయోగాలపై సదరు అధికారులు వివరించారు. రాష్ట్ర కిసాన్ మోర్చా డ్రైనేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, మండల అధ్యక్షుడు పట్టపు సూర్యప్రకాశరావు, నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు అభినందన


విద్యార్థులను సన్మానిస్తున్న సీఐ గోవిందరాజు

మలికిపురం: స్థానిక ఎంవీఎన్ జేఎస్ అండ్ ఆర్‌వీఆర్ ప్రభుత్వ డిగ్రీ ఎయిడెడ్ కళాశాలలో చదివిన విద్యార్థులు కడలి అరుణ, కడలి రేవతి సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్‌గా, బత్తుల రాజాజీ టాక్స్ అసిస్టెంట్‌గా ఎంపికైన నేపథ్యంలో కళాశాలలో విద్యార్థి సంఘాలు వారిని ఘనంగా సన్మానించాయి. సోమవారం సంఘ నాయకుడు గణేష్ పోలిశెట్టి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాజోలు సీఐ ఆర్ గోవిందరాజు పాల్గొని మాట్లాడుతూ ప్రతిభ కనబరచిన విద్యార్థులను అభినందించారు. మలికిపురం ఎస్సై బి.సంపత్‌కుమార్, ఎంఈవో విజయశ్రీ, కళాశాల ప్రిన్సిపాల్ తోరం సతీష్, పలువురి చేతుల మీదుగా విద్యార్థులను సన్మానించారు.

చదువుతోనే దేశ ప్రగతి


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ శ్రీనివాసరావు

అయినవిల్లి: చదువుతోనే దేశ ప్రగతి ఆధారపడి ఉందని జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ముక్తేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యాభారతి స్టడీ మెటీరియల్‌ను పదో తరగతి విద్యార్థులకు జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తుందన్నారు. ప్రభుత్వ విద్యకు పెద్దపీట వేస్తున్నారన్నారు. ఇంకా అనేక మంది దాతలు పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతికి నిధులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిమ్మకాయల గణేశ్వరరావు అధ్యక్షత వహించారు. సిరిపల్లి సర్పంచ్ కుడుపూడి శాంతావతి, ఎంపీటీసీ యడ్ల కిరణ్‌బాబు, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

కాలుష్యం బారి నుంచి రక్షణ కల్పించండి

అలమూరు: స్థానిక దేవి థియేటర్ సమీపాన ఉన్న రెండు రైసుమిల్లుల నుంచి వస్తున్న కాలుష్యం నుంచి రక్షణ కల్పించాలని పాపయ్య కాలనీ వాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆలమూరు ఎంపీపీ కార్యాలయంలో ఎంపీడీఓ కె.జాన్ లింకన్‌కు, పంచాయతీ ఈఓ కె.సంజీవరెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. రైసుమిల్లుల్లో ప్రతి రోజు వస్తున్న దుమ్ము, ధూళితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

మెగా డీఎస్సీ విడుదల చేయాలి

మలికిపురం: మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని, జూనియర్, డిగ్రీ లెక్చరర్స్, గ్రూప్ 1 గ్రూప్ 2 పోస్టులను పెంచి రీనోటిఫికేషన్ ఇవ్వాలని కోరుతూ విద్యార్థి సంఘాలు సోమవారం మలికిపురంలో ర్యాలీ నిర్వహించాయి. రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున మలికిపురం గాంధీ బొమ్మ సెంటర్ వద్ద విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల నాసర్‌జీ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ తక్షణమే రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న రెండు లక్షల 35 వేల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దేవ రాజేంద్రప్రసాద్, జిల్లా కన్వీనర్ రవికుమార్, మలికిపురం మండలం అధ్యక్షుడు జన్ను, కార్యదర్శి మణికంఠ తదితరులు పాల్గొన్నారు.